
సాక్షి
అనంతపురం

ఆదివారం । 24 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.32	సెహరీ : 5.04



న్యూస్‌రీల్

లోక్‌అదాలత్‌ది అప్పీలుకు వీల్లేని తీర్పు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

అనంతపురం: శాశ్వత లోక్ అదాలత్‌లో వెలువడే తీర్పులపై అప్పీలుకు అవకాశం ఉండదని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో శనివారం పలు ప్రభుత్వ శాఖల అధికారులకు శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం చైర్మన్, న్యాయమూర్తి కే. శ్రీనివాస రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా అందుతున్న న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ రాజీ మార్గంలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు.రాజీ కుదరని పక్షంలో తీర్పు వెలువరించగల అధికారం కలిగి ఉందన్నారు. ఇరుపక్షాల నడుమ సామరస్యంగా సమస్య పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు ఎంవీఎల్ఎస్ శ్రీనివాస రావు, సీనియర్ అడ్వకేట్ కే. పద్మ నారాయణ రెడ్డి శాశ్వత లోక్‌అదాలత్ గురించి ప్రసంగించారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ఏపీ గురుకుల పాఠశాలల్లో (గుత్తి బాలికలు, నూతిమడుగు బాలురు) 5 తరగతి, 6,7,8 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లు, గురుకుల కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి, నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి ఏప్రిల్ 25న రాత పరీక్ష ఉంటుందని జిల్లా ఏపీఆర్ఎస్,జేసీ,డీసీ కోఆర్డినేటర్ జీఏ విజయలత ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 31లోగా https://aprs. apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. గార్లదిన్నె మైనార్టీ బాలుర పాఠశాలలో నేరుగా అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు.

5వ తరగతిలో ప్రవేశానికి ఎంపిక జాబితా విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశానికి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. పరీక్ష రాసిన విద్యార్థులు పొందిన మార్కులు, సీట్ల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్ర అధికారులు ఎంపిక జాబితా రూపొందించారని ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. అనంతపురం జిల్లాలో 640 సీట్ల కోసం 640 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 560 సీట్లకు 560 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్లకు సమాచారం అందించామని వెల్లడించారు.అలాగే వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచామన్నారు. అలాట్‌మెంట్ ఆర్డర్ డౌన్‌లోడ్ చేసుకుని అడ్మిషన్‌కు కావాల్సిన పత్రాలను ఏప్రిల్ 6 లోగా ఆయా గురుకులాల్లో అందజేయాలని స్పష్టం చేశారు. గడువులోపు అడ్మిషన్ పొందకుంటే, సీట్లను మెరిట్ లిస్ట్‌లోని తర్వాత విద్యార్థులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో తల్లిదండ్రులు ఆప్షన్ ఇచ్చిన గురుకులాల్లోనే సీట్లు కేటాయించారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర పాఠశాలలకు సీటు బదిలీకి అవకాశం ఉండదన్నారు అడ్మిషన్లకు సంబంధించిన ప్రతి విషయం పేపర్ ప్రకటన, ప్రిన్సిపాళ్ల ద్వారా తెలియజేస్తామని, మధ్యవర్తులను నమ్మొద్దని సూచించారు.

3,044 మంది గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు జిల్లాలో 3,044 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 31,330 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 30,958 మంది హాజరయ్యారు. 372 మంది గైర్హాజరయ్యారు. 5,057 మంది ప్రైవేటు విద్యార్థులకు గాను 2,385 మంది హాజరయ్యారు. 2,672 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సార్వత్రిక విద్యాపీఠం పరీక్షల్లో భాగంగా ఇంటర్ పరీక్షకు 2,621 మందికి గాను 2,376 మంది విద్యార్థులు హాజరయ్యారు. 214 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి పరీక్షకు 897 మందికి గాను 815 మంది హాజరయ్యారు.

బాబు జిత్తులు.. పొత్తు చిత్తు!

గ్లాసు బద్దలు.. కమలం తలకిందులు

- జనసేన, బీజేపీలను నలిపేసిన చంద్రబాబు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉనికే లేకుండా పోయిన జనసేన
- కాషాయ పార్టీ పోటీలో లేకుండా జాగ్రత్త పడిన బాబు
- ధర్మవరం సీటు బీజేపీకి ఇచ్చినా అభ్యర్థి ఆయన మనిషే
- పొత్తు ధర్మం గాలికొదిలేశారని బీజేపీ, జనసేన శ్రేణుల ఆగ్రహం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: తన జిత్తులమారి తనాన్ని చంద్రబాబు మరోసారి చాటుకున్నారు. తనను నమ్ముకుంటే ఎవరైనా నట్టేట మునగాల్సిందే అని అందరూ అనే మాటను మళ్లీ రుజువు చేశారు. పొత్తు ధర్మం అంటే ఇలా కూడా ఉంటుందా అన్న రీతిలో జనసేన, బీజేపీలకు చంద్రబాబు రుచి చూపించారు. కొన్ని రోజులుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరుగుతున్న ఘటనలను గమనిస్తే ఈ విషయం ఇట్టే అర్థమైతుంది. తన పార్టీ అభ్యర్థులనే పొత్తు పార్టీల్లోకి పంపించడం, లేదంటే సీటు లాక్కోవడం వంటి కుయుక్తులకు పాల్పడుతూ రాజకీయ విశ్లేషకులనే కాకుండా సాధారణ ప్రజానీకాన్ని కూడా ముక్కున వేలేసుకునేలా చేస్తున్నారు.

జనసేన కథ ముగిసినట్టే..!

14 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంటు స్థానాలు ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్కటంటే ఒక్క సీటు కూడా లేకుండా జనసేనకు చెక్ పెట్టగలిగారు. చంద్రబాబు దెబ్బకు గ్లాసు పార్టీ (జనసేన) కథ ముగిసినట్టేనని కేడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. 14 నియోజకవర్గాల్లో ఒక్కసీటు కూడా లేకుండా చేయడమంటే కథ ముగిసినట్టు కాక మరేమిటని ఆ పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ధర్మవరంలో చిలకం మధుసూదన్‌రెడ్డి, అనంతపురంలో టీసీ వరుణ్ జనసేన తరఫున సీటుకోసం గట్టిగా ప్రయత్నించారు. అనంతపురం సీటు వస్తుందనుకున్న దశలో బాబు వ్యూహం పన్ని దాన్ని లాగేసుకున్నారు.

బీజేపీ పరిస్థితీ అంతే

భారతీయ జనతాపార్టీ పరిస్థితి కూడా ఉమ్మడి అనంతపురం జిల్లాలో దారుణంగా ఉంది. తొలుత హిందూపురం పార్లమెంటు సీటు బీజేపీకి వస్తుందని బాగా ప్రచారం జరిగింది. తర్వాత గుంతకల్లు అసెంబ్లీ సీటు కూడా అన్నారు. చివరికి, హిందూ పురం పార్లమెంటు అభ్యర్థిగా బీకే పార్థసారథిని చంద్రబాబు ప్రకటించారు. దీంతో బీజేపీ తరఫున హిందూపురం పార్లమెంటు టికెట్ ఆశించిన పరిపూర్ణానందస్వామి, సత్యకుమార్, అంబికా కృష్ణ లాంటి వారి ఆశలు అడియాసలయ్యాయి.

అక్కడి అభ్యర్థి బాబు మనిషే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీజేపీకి కేటాయించనున్నట్టు చెప్పుకుంటున్న సీటు ధర్మవరం ఒకే ఒక్కటి. ఇక్కడ ప్రస్తుతం వరదాపురం సూరి పోటీలో ఉన్నారు. ఈయనకు గనుక సీటు ఇస్తే టీడీపీకి ఇచ్చినట్టే!. 2019లో వరదాపురం సూరి ధర్మవరం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఘోరంగా ఓడిపోయారు. ఆ తర్వాత తన అక్రమాలు బయటకు వస్తాయేమోనన్న భయంతో బీజేపీలోకి వెళ్లారు. బీజేపీలోకి వెళ్లినా ఆయన ఆత్మ టీడీపీలోనే ఉండేది అందరికీ తెలిసిందే. అంతెందుకు బీజేపీలో అయినా, టీడీపీలో అయినా ఏ పార్టీనుంచైనా సీటు తనదే అంటూ వరదాపురం సూరి ప్రకటించారు కూడా. దీన్నిబట్టి చూస్తే బాబు పొత్తు ధర్మాన్ని తుంగలో తొక్కారని బీజేపీ, జనసేన శ్రేణులు వాపోతున్నాయి. బీజేపీ తరఫున ఎంపీ సీటుకు పోటీపడి మోసపోయిన పరిపూర్ణానంద స్వామి, అంబికాకృష్ణ, సత్యకుమార్ లాంటి వారికి కూడా బాబు ఎత్తుల జిత్తులు ఏంటో తెలిసివచ్చినట్టయిందని బీజేపీ శ్రేణులు అంటున్నాయి. ఏదేమైతేనేం ఉమ్మడి అనంతపురం జిల్లాలో జనసేనకు ఒక్కసీటు కూడా లేకపోగా.. ధర్మవరంలోనూ బీజేపీ తరఫున సూరికి గనుక సీటు వస్తే బాబు తనమనిషికే ఇప్పించుకుంటున్నట్టు అవుతుందని టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి.

హనుమంత వాహనంపై ఖాద్రీశుడి రాజసం



కదిరి: లక్ష్మీ నారసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన శనివారం రాత్రి శ్రీవారు హనుమంత వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. నరసింహావతారంలో హిరణ్యకశ్యపుని సంహారం అనంతరం సాక్షాత్తు హనుమంతుడే దిగివచ్చి శ్రీ మహావిష్ణువును తన భుజస్కందాలపై మోస్తాడని భక్తుల నమ్మకం. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం విల్లంబులు ధరించి హనుమంతుని భుజాలపై కొలువుదీరిన శ్రీవారిని చూడడానికి రెండు కళ్లు సరిపోలేదు. త్రేతాయుగంలో తనకు సేవ చేసిన భక్త శిఖామణి హనుమంతున్ని వాహనంగా చేసుకొని స్వామివారు తిరువీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు. హనుమంతుని భక్తి తత్పరతను ఈ కాలం వారికి వివరిస్తూ రాముడు, కృష్ణుడు, నారసింహుడు అన్నీ తానేనని స్వామి వారు తెలియజేస్తారని అర్చక పండితులు తెలిపారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు

- జిల్లా ఎన్నికల అధికారి గౌతమి, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

రాయదుర్గం/కళ్యాణదుర్గం రూరల్: జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. శనివారం వారు కళ్యాణదుర్గం, రాయదుర్గం పట్టణాల్లో పర్యటించారు. కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎలం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, రాయదుర్గం మార్కెట్‌యార్డులో ఈవీఎంల భద్రత, ఎన్నికల సామగ్రి పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.ఎంసీసీ,సీ-విజిల్, ఎంసీఎంసీ యాప్‌లతో పాటు పలు అంశాలపై ఇప్పటికే విస్తృతంగా అవగాహన కల్పించామన్నారు.



రాయదుర్గం మార్కెట్ యార్డులో ఈవీఎంలు భద్రపరిచే గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

జిల్లాలో 14,885 మందిని సెక్టార్, సెక్టార్ పోలీస్, నోడల్ అధికారులుగా నియమించామన్నారు. మద్యం, డబ్బు అక్రమ రవాణా జరగకుండా అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 38 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రచారాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు, బ్యానర్లు, జెండాలు, ఫ్లెక్సీల ప్రదర్శన, హెలికాప్టర్, హెలిప్యాడ్‌ల వినియోగం, అభ్యర్థులు, ఇతర నాయకుల ప్రచార వాహనాలు తదితర 26 అంశాలకు సంబంధించిన అనుమతులన్నీ పక్కాగా యాప్‌లో నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

ఎన్నికల నియమ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. ఇప్పటికే అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రౌడీషీటర్లు, అల్లర్లకు పాల్పడే వారిని బైండోవర్ చేస్తున్నామన్నారు. లైసెన్స్ తుపాకులు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా ముమ్మరం చేస్తామన్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లేందుకు ఆధారాలు చూపాల్సిందేనన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోగా పట్టణాలు, సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు, కార్డెన్ సెర్చ్ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుష్మిత, డీఎస్పీ బీ శ్రీనివాసులు, ఆర్‌ఓ కరుణకుమారి, రూరల్ సీఐ ప్రసాద్ బాబు, తహసీల్దార్ చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నింటికీ అనుమతి తప్పనిసరి

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల ప్రచారం, వాహనాలు, ప్రచార సామగ్రి రవాణాకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని కలెక్టర్ ఎం.గౌతమి స్పష్టం చేశారు. అన్ని శాఖల నుంచి ఎన్‌ఓసీ తీసుకుని సింగిల్ విండో ఎన్కోర్ ద్వారా అనుమతులు మంజూరు చేస్తామన్నారు.

పార్లమెంటరీ అధికారం సీఈసీదే..

- పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి దరఖాస్తులు ఆమోదించే అధికారం ప్రధాన ఎన్నికల అధికారికి ఉంటుంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రచారం, ప్రచార సామగ్రి రవాణా వాహనాల అనుమతికి ప్రధాన ఎన్నికల అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలి. పార్టీల స్టార్ క్యాంపెయినర్లు, పార్టీల ఆఫీస్ బేరర్ల వాహనాలకు, వీడియో వ్యాన్ కోసం సీఈసీకే దరఖాస్తు చేసుకోవాలి.

జిల్లా ఎన్నికల అధికారికైతే ఇలా..

- జిల్లాస్థాయి ఆఫీస్ బేరర్ వాహనం
- హెలికాప్టర్, హెలిప్యాడ్, ఎయిర్ బెలూన్ల కోసం

పార్లమెంటు ఆర్‌ఓ వద్ద..

- సమావేశం, ఊరేగింపు, లౌడ్ స్పీకర్ ఏర్పాటుకు
- తాత్కాలిక పార్టీ కార్యాలయం తెరిచేందుకు
- ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీకి
- అభ్యర్థి కోసం పూర్తి అసెంబ్లీ ప్రాంతానికి ఒక వాహనం, పార్లమెంట్ పరిధిలో వాహనం, లౌడ్ స్పీకర్ అమర్చిన వాహనం కోసం
- బ్యానర్, జెండాలు ప్రదర్శించేందుకు, ర్యాలీ నిర్వహించేందుకు.

ఏఆర్‌ఓ వద్ద దరఖాస్తు ఇలా..

- అభ్యర్థి ఎన్నికల ఏజెంట్ కోసం పూర్తి అసెంబ్లీ ప్రాంతానికి ఒక వాహనం
- పార్టీ, పార్టీ కార్యకర్త కోసం ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒక వాహనం
- పోస్టర్లు, హోర్డింగ్, యూనీపోల్ ప్రదర్శించేందుకు ఏఆర్‌ఓ వద్ద అనుమతి పొందాలి.

కేశవ్‌కు ఓట్లడిగే నైతిక అర్హత లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు విశ్వ, శంకర్‌నారాయణ, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మంజుల

- టీడీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శంకర్‌నారాయణ, విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకర్‌నారాయణ అన్నారు. శనివారం ఉరవకొండ పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను మోసం చేస్తూ, వారి సమస్యలు పట్టించుకోకుండా గత ఐదేళ్లూ చుట్టపుచూపుగా నియోజకవర్గానికి వచ్చి వెళ్లిన ఘనుడు పయ్యావుల కేశవ్ అన్నారు. మళ్లీ నేడు ఓట్ల కోసం ప్రజల దగ్గరికి వెళ్తూ మభ్యపెట్టడానికి యత్నిస్తున్నారన్నారు. ప్రజలే కేశవ్‌ను తరిమికొడతారని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున ప్రజా సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. జన హృదయాల్లో వైఎస్ జగన్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఉరవకొండలో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు అభ్యర్థి శంకర్‌నారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఎంతో ఆత్మీయంగా తమకు స్వాగతం పలుకుతున్నారన్నారు. సంక్షేమ పాలనకే మా మద్దతు అంటూ చెబుతున్నారన్నారు. వైఎస్ జగన్ మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు ఒక ఎంపీ స్థానాన్ని వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే అన్ని వర్గాలకూ న్యాయం జరిగిందన్నారు. ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల మాట్లాడుతూ కేశవ్‌కు బుద్ధి చెప్పడానికి ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఫ్యాన్ గాలికి టీడీపీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు.కార్యక్రమంలో నాయకులు పామిడి వీరాంజినేయులు, ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఎంపీటీసీ గీతా, పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, సర్పంచ్‌లు లలితమ్మ, మోనాలీసా, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, సుద్దాల వెంకటేష్, అంగదాల అంజి, పీఏసీఎస్ చైర్మన్ వడ్లషేక్షావలి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, సలీం తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌బుక్కులు కూడా చూడలేరా?

- మన పిల్లలకు ఇలా చదువు చెబితే ఒప్పుకుంటామా?
- టీచర్లపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం
- పేద పిల్లల విషయంలో బాధ్యతగా ఉండాలని హితవు



శారదా ప్రాథమిక పాఠశాలలో వర్క్‌బుక్ పరిశీలిస్తున్న ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్

అనంతపురం ఎడ్యుకేషన్: ''వర్క్‌బుక్స్‌లో పిల్లలు ఏం రాశారో చూడడం లేదు. తరగతిలో ఉన్న 16 మంది పిల్లల బుక్స్ కూడా చూడడం లేదంటే మీరెంత బాధ్యతారహితంగా పని చేస్తున్నారో అర్థమవుతోంది. దేవుడి సాక్షిగా చెప్పండి మన పిల్లలు చదివే స్కూళ్లలో ఇలానే చదువులు చెబితే మనం ఒప్పుకుంటామా?'' అని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మండిపడ్డారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన నగరంలో ప్రభుత్వ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా మూడో రోడ్డులోని శారదా నగరపాలక ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించారు. టీచర్లు కరెక్షన్ చేయకపోవడాన్ని గుర్తించి అసహనం వ్యక్తం చేశారు. ఉద్యోగ ధర్మం పాటించకపోవడం అన్యాయమన్నారు. కేవలం పదో తరగతి విద్యార్థులకు మాత్రమే పబ్లిక్ పరీక్షలు కాదన్నారు. 1–9 తరగతులకు అదే తరహాలో పరీక్షలుంటాయన్నారు. ఆ విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాల్సిన బాధ్యత ఎవరిది? అని ప్రశ్నించారు. గుర్తించిన లోపాలను సరిదిద్ది తన మొబైల్ నంబరుకు ఫోన్ చేయాలంటూ హెచ్‌ఎంను ఆదేశించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. బాలుర బాత్రూంలో కొళాయి తిరగకపోవడంతో స్వయంగా తిప్పి ఆన్ చేశారు. తిరిగి ఆఫ్ కాకపోవడంపై ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 52 ఏళ్ల వయసున్న తానే ట్యాప్ ఆన్ చేయలేకపోయానని, చిన్న పిల్లలు ఎలా ఆన్ చేస్తారు? అని ప్రశ్నించారు. బడుల అభివృద్ధి కోసం రూ. 9 వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని, ఏదైనా మనసు పెట్టి పని చేయాలని సూచించారు.

ఇంత దుబారా చేస్తారా?

అనంతరం సునీతనగర్‌లోని 8వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ముఖ్య కార్యదర్శి పరిశీలించారు. అద్దె భవనంలో ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న శారదా ప్రాథమిక పాఠశాలలో రెండు గదులు ఖాళీగా ఉన్నాయి, ఎందుకు అక్కడికి మార్చలేదని పీడీ, సీడీపీఓపై మండిపడ్డారు. ప్రతి నెలా రూ. 5,500 అద్దె చెల్లించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రైమరీ స్కూల్‌కు అనుబంధంగానే అంగన్‌వాడీ కేంద్రాలుంటే చిన్నారుల్లో చదివే స్థాయి పెరుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అమలు చేయకపోతే ఎలా? అంటూ అసహనం వ్యక్తం చేశారు.

డిజిటల్ బోధనపై అవగాహన పెంచుకోవాలి

కేజీబీవీ ప్రభుత్వ బాలికల పాఠశాలను ప్రవీణ్ ప్రకాష్ సందర్శించారు. ఐఎఫ్‌పీల బోధన తీరును పరిశీలించారు. పోటీ ప్రపంచంలో తట్టుకునేందుకు వీలుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను తీసుకొచ్చామన్నారు. ముందుగా అధికారులు, హెచ్‌ఎంలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని ఆదేశించారు. తరగతి గదుల్లో విద్యార్థులు కింద కూర్చోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఏ ఒక్క విద్యార్థీ కింద కూర్చోవడానికి వీలు లేదని, వెంటనే ఫర్నీచరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పాఠశాల విద్య ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈఓ వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీఓ వరప్రసాదరావు, ఈఈ శివకుమార్, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థి పల్లెనిద్ర



పల్లె నిద్ర చేస్తున్న వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు

బుక్కరాయసముద్రం: ఆయనో సాధారణ టిప్పర్ డ్రైవర్. అయినా, ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడేవారు. అలాంటి వ్యక్తిని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుర్తించారు. కాసులు ముట్టజెబితే కానీ టికెట్ ఇవ్వననే పార్టీలున్న ఈ కాలంలోనూ ప్రజా సేవే గీటురాయిగా మార్చుకున్న ఆ వ్యక్తికి పట్టం కట్టారు. ఏకంగా తన పార్టీ తరఫున అసెంబ్లీ టికెట్టు కేటాయించారు. ఆ వ్యక్తి ఎవరో కాదు వైఎస్సార్ సీపీ శింగనమల అభ్యర్థి వీరాంజనేయులు. ఓ సాధారణ వ్యక్తినైన తనకు పెద్ద బాధ్యతను అప్పగించడంతో వీరాంజనేయులు ప్రజలతో మరింతగా మమేకమవుతున్నారు. ఈ క్రమంలోనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పగలంతా ఎన్నికల ప్రచారంలో మునుగుతున్న ఆయన.. రాత్రి కూడా 'పల్లె నిద్ర' ద్వారా ప్రజలకు చేరువవుతున్నారు. ప్రభుత్వం నుంచి వారికి చేకూరిన లబ్ధిని తెలుసుకుంటున్నారు. శనివారం రోటరీపురం గ్రామంలోని దళితవాడలో సర్పంచ్ నాగభూషణ ఇంట్లో వీరాంజనేయులు నిద్రించారు. ఓ ఎమ్మెల్యే అభ్యర్థి ఏకంగా తమ గ్రామంలోనే బస చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

సెలవు రోజుల్లోనూ బిల్లుల చెల్లింపు

అనంతపురం సిటీ: వినియోగదారుల సౌకర్యార్థం సెలవు రోజుల్లోనూ బీఎస్ఎన్ఎల్ క్యాష్ కౌంటర్లు పని చేస్తాయని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 24, 31 తేదీలతో పాటు 29న గుడ్‌ఫ్రైడే రోజు కూడా కౌంటర్లు తెరిచే ఉంచుతారని వివరించారు. రెండేళ్లకు పైబడి పాత బకాయిలు ఉన్న వినియోగదారులు 50 శాతం వరకు రాయితీతో స్పాట్ సెటిల్మెంట్ చేసుకోవచ్చని తెలిపారు.

ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం సివిజిల్

- ఎన్నికల కమిషన్‌కు నేరుగా ఫిర్యాదు
- ఎంసీసీ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయొచ్చు
- డబ్బు, మద్యం పంపిణీ, తదితర వాటిపైనా..
- ఘటనలు చిత్రీకరించి యాప్ ద్వారా పంపాలి
- ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో చర్యలు

ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ఎన్నికల కమిషన్ 'సి-విజిల్'యాప్ ప్రవేశపెట్టింది. ఇది ప్రజల చేతిలో 'బ్రహ్మాస్త్రం' అని చెప్పొచ్చు. ఎన్నికల్లో ప్రవర్తన నియమావళి ఉల్లంఘన, అక్రమంగా డబ్బు, మద్యం పంపిణీ, ఓటర్లను నిర్బంధించడం, దాడులకు పాల్పడడం, వంటి ఇతరత్ర చర్యలకు పాల్పడే ఘటనలను చిత్రీకరించి 'సివిజిల్' ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో చర్యలు ఉంటాయి.

అనంతపురం అర్బన్: సి అంటే సివిలియన్ (పౌరుడు) విజిల్ అంటే హెచ్చరిక. ఎన్నికల సందర్భంగా జరిగే అక్రమాలు నిరోధించడానికి పౌరులు పాలనా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసేందుకు పంపే హెచ్చరికలే సివిజిల్‌గా పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిని (ఎంసీసీ), విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టడాన్ని నిరోధించడానికి భారత ఎన్నికల కమిషన్ ప్రజల చేతికిచ్చిన బ్రహ్మాస్త్రం 'సివిజిల్'. సివిజిల్ ద్వారా పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాల్సిన ఆవశ్యకత ఉందని కమిషన్ పేర్కొంది.

డౌన్‌లోడ్ ఇలా...

సివిజిల్ అనేది యూజర్ ఫ్రెండ్లీ అప్లికేషన్. దీనిని గూగుల్ ప్లే స్టోర్ నుంచి లేదా https://cvigil.eci.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎన్నికల నిర్వహణ క్రమంలో జరిగే అక్రమాలను ఆపటానికి, ఫిర్యాదు చేసేందుకు ఈసీఐ, సీఈఓ, డీఈఓ, ఆర్‌ఓల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు.

అక్రమాలను రికార్డు చేసి పంపాలి

ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను ఆండ్రాయిడ్ ఫోన్‌లో రికార్డు చేసి 'సివిజిల్' యాప్ ద్వారా పంపాలి. కచ్చితమైన ప్రాంతం గుర్తించేందుకు ఇందులో జీఐఎస్, జీపీఎస్ విధానం కూడా ఉంటుంది.

నావిగేషన్ సౌకర్యం ఉంటుంది

సి-విజిల్ ద్వారా పంపిన సమాచారం ఈసీఐ, సీఈఓ, డీఈఓ, జిల్లా కంట్రోల్ సెల్‌కు చేరగానే, క్షేత్రస్థాయి ఎంసీసీ బృందాలను అప్రమత్తం చేస్తారు. అక్రమాలు జరిగాయన్న ప్రదేశానికి క్షేత్రస్థాయి బృందాలు కచ్చితంగా చేరుకోవడానికి నావిగేషన్ సౌకర్యం ఉంటుంది.

ఐడీ నంబర్ ఇస్తారు

ఫిర్యాదుదారు పంపిన ఫిర్యాదు రిజిస్టర్ కావాలని కోరుకుంటే వారికో ఐడీ నంబరు కూడా ఇస్తారు. అయితే చిరునామా ఇవ్వని వారు చేసే ఫిర్యాదులకు ఐడీ నంబర్ ఉత్పత్తి కాదు. సివిజిల్ వినియోగించే వారు ఎంసీసీ లేదా వ్యయానికి సంబంధించిన సమాచారమే పంపాలి.



సివిజిల్ యాప్



సివిజిల్ ద్వారా చేయాల్సిన ఫిర్యాదులు

ఆధారాలతో ఫిర్యాదు

డబ్బులు, మద్యం, ఇతరత్ర వస్తువుల పంపిణీ, ఎంసీసీ ఫిర్యాదులు పంపడానికి సి-విజిల్ వేగవంతమైన విధానం. సి-విజిల్ యాప్ ద్వారా ఆధారాలతో సహా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది.

5 నిమిషాల్లో పంపాలి..

ఇప్పటికే స్టోర్ చేసిన మెసేజ్‌లు, గతంలో తీసిన వీడియోలు, ఫొటోలు వంటివి సి-విజిల్ ద్వారా పంపే అవకాశం లేదు. గ్యాలరీ, మెమొరీస్ నుంచి పంపించే అవకాశం లేదు. సి-విజిల్ యాప్ ద్వారా తీసిన సమాచారాన్ని అదే స్మార్ట్ ఫోన్ నుంచి 5 నిమిషాల్లో పంపాలి. ఫిర్యాదు కచ్చితమైనది అయి ఉండాలి.

ఖాతా క్రియేషన్ ఇలా...

- భారత ఎన్నికల కమిషన్ సి-విజిల్ అకౌంట్ క్రియేట్ చేసి సీఈఓకు పంపుతారు. సీఈఓకు ఓటీపీ వస్తుంది. సీఈఓ యూజ్ లాగ్ చేసుకుని పర్యవేక్షకులకు అకౌంట్ క్రియేట్ చేస్తారు.
- సీఈఓనే డీఈఓలకు, ఆర్‌ఓలకు అకౌంట్ క్రియేట్ చేస్తారు. వారికి ఓటీపీ రాగానే క్షేత్రస్థాయి సర్వైలెన్స్ బృందాలకు అకౌంట్లు క్రియేట్ చేస్తారు. పార్లమెంట్‌కు, శాసనసభలకు ఒకే అకౌంట్ ఉంటుంది.

ఫీల్డ్ లెవల్ యూనిట్లు క్రియేట్ చేయాలంటే...

సివిజిల్ ఉన్న investigater పై క్లిక్ చేయాలి. Add new team పై క్లిక్ చేసి ఇతర ఫీల్డ్ బృందాలను యాడ్ చేయాలి. పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాల పేర్లు, ఫీల్డ్ యూనిట్ల పేర్లు ఎంటర్ చేయాలి. ఫిర్యాదు చేయడానికి అనవసరమైన జాగ్రత్తలు

- 4జీ, 5జీ స్మార్ట్ ఫోన్ విత్ ఆండ్రాయిడ్ 4.1''5(4,1''5) ఎల్లీబీన్ వర్షన్.
- స్మార్ట్ ఫోన్‌లో కెమెరా బాగుండాలి. ఇంటర్నెట్ బాగుండాలి. జీపీఎస్ ఆన్ చేయాలి. ఫోన్‌లో తగినంత మెమొరీ ఉండాలి.
- ఎంసీసీ, ఖర్చు జరుగుతున్న చోటనే స్పందించాలి.

ఫిర్యాదు చేయాల్సిన అంశాలు

- డబ్బు పంపిణీ. కొందరు డబ్బుకు బదులు కూపన్లు ఇస్తారు. ఫలానా చోట కూపన్లు ఇచ్చి డబ్బులు, వస్తువులు తెచ్చుకోవాలంటారు. మద్యం పంపిణీ.
- అనుమతిలేని పోస్టర్లు, బ్యానర్ల పంపిణీ. పెయిడ్ న్యూస్.
- భయపెట్టడం, ప్రలోభపెట్టడం
- కాన్వాయ్‌లో అనుమతి కన్నా ఎక్కువ వాహనాలు వెళ్లడం.

ఫిర్యాదులు ఎలా పంపాలి

- అక్రమాలు జరుగుతున్న సన్నివేశాలను ఫొటో లేదా వీడియో తీయాలి.
- లొకేషన్ ఆన్ చేస్తే జీపీఎస్ యాక్టివేట్ అవుతుంది.
- నెట్ లేదా వైఫై ఆన్ చేయాలి.
- ప్రయాణిస్తూ ఫొటోలు, వీడియోలు తీయడం వల్ల వాస్తవ ప్రదేశం రాదు.
- భవనాల లోపల, చెట్ల కింద తీయకూడదు.
- ఫొటో లేదా వీడియో తీయగానే దానంతటదే తేదీ, సమయం రికార్డవుతాయి.
- ఫొటో లేదా వీడియో తీయగానే స్క్రీన్ మీద ప్రివ్యూ కనిపిస్తుంది. ఏం తీశామన్న దానిని ఒకసారి చూసి నిర్ధారించుకోవాలి.
- అది ఏ రకమైన అక్రమం అనేదాని కోసం డౌన్ లిస్ట్ చూడాలి.
- స్పేస్ కాలమ్‌లో ఏ రకమైన అక్రమం అనేది క్లుప్తంగా రాయాలి.
- అప్‌లోడ్ చేసిన సమాచారం గురించి స్క్రీన్ మీద కన్ఫర్మేషన్ అడుగుతుంది. అప్‌లోడ్ చేసి సమాచారం ఒకసారి పరిశీలించుకుని కన్‌ఫర్మ్ చేస్తే అది ఫార్వర్డ్ అవుతుంది.
- ఫార్వర్డ్ కాగానే సబ్మిట్ సక్సెస్‌ఫుల్లీ అని వస్తుంది.
- పంపిన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు మెనులోకి వెళ్లి స్టేటస్ ఆప్షన్ ద్వారా తెలుసుకోవచ్చు.

- ప్రభుత్వ భవనాలు, స్థలాల్లో ప్రచార సామగ్రిని ఉంచి ప్రచారం చేయడం, స్లోగన్లు రాయడం. ఓటర్లను రవాణా చేయడం.
- పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల లోపు ప్రచారం చేయడం. ప్రచారంలో మతాన్ని ఉపయోగించడం.
- ఓటింగ్‌కు 48 గంటలలోపు ప్రచారం చేయడం. రాత్రి 10 గంటల తరువాత, ఉదయం 6 గంటలకు ముందు లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం. సభలు, సమావేశాలక ప్రజలను తరలించడం.

క్లుప్తంగా

ముగ్గురు టెన్త్ విద్యార్థులకు గాయాలు



గాయపడిన రవితేజ, నరేష్, అజయ్

గుంతకల్లు: పరీక్ష రాసి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న ముగ్గురు పదో తరగతి విద్యార్థులు కారును ఢీకొని గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. కమలపాడుకు చెందిన పదో తరగతి విద్యార్థులు రవితేజ, నరేష్, అజయ్‌కు మండల కేంద్రం వజ్రకరూరులోని జెడ్పీ హైస్కూలు పరీక్ష కేంద్రం పడింది. రోజు మాదిరిగానే ముగ్గురూ శనివారం ఫిజికల్ సైన్స్ పరీక్ష రాసి బైక్‌పై ఇంటికి బయల్దేరారు. కమలపాడు బస్టాండ్ వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. రవితేజకు ముఖంపైన, అజయ్‌కు ఎడమకాలు, నరేష్‌కు దవడ కింద భాగాల్లో గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది, కానిస్టేబుల్ గంగాధర్ సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులను గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రవితేజను ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

నూర్పిడి యంత్రం బోల్తా.. నలుగురికి గాయాలు

పెద్దవడుగూరు : మేడిమాకుపల్లి సమీపంలో పంట నూర్పిడి యంత్రం బోల్తాపడి నలుగురు గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిత్రచేడు గ్రామానికి చెందిన కొందరు కూలీలు శనివారం భీమునిపల్లికి చెందిన వేరుశనగ పొలాల్లో పంట నూర్పిడి చేయడానికి యంత్రంతో ట్రాక్టర్‌లో బయల్దేరారు. మేడిమాకులపల్లి సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. యంత్రంపై కూర్చున్న కూలీలు రంగనాయకులు, శ్రీరాములు, మాబు, నాగార్జున గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో పెద్దవడుగూరు పీహెచ్‌సీకి తీసుకెళ్లగా డాక్టర్ శ్రీనివాసబాబు ప్రథమ చికిత్స చేశారు. తీవ్రగాయాలైన వారిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

మాజీ క్రికెటర్ చంద్రమోహన్ మృతి



చంద్రమోహన్ (ఫైల్)

అనంతపురం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, మాజీ క్రికెటర్ చంద్రమోహన్ (52) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ, పీజీ కళాశాలలో పీడీగా పనిచేస్తున్నారు. ఎంతో మంది క్రికెటర్లను తీర్చిదిద్దిన కోచ్‌గానూ ఖ్యాతి గడించారు. ఆంధ్రా సౌత్ జోన్ అండర్-19లో ఆడారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్రికెట్ జట్టులో వికెట్ కీపర్, కుడి చేతి బ్యాటర్‌గా రాణించారు. చంద్రమోహన్ భార్య చంద్రకళ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. వీరికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. చంద్రమోహన్ ఆకస్మిక మృతి పట్ల పలువురు క్రికెటర్లు దిగ్భ్రాంతి చెందారు. ఆదివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

గరుడ వాహనంపై చెన్నకేశవుడు



యాడికి: మండల కేంద్రంలోని శివలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చెన్నకేశవస్వామి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ అర్చకుడు హరికృష్ణ శర్మ ఉదయం స్వామి వారికి హోమం, అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేపట్టారు. రాచమడుగు వెంకట గిరియప్ప కుమారుడు రామమూర్తి శ్రేష్టి ఆధ్వర్యంలో రాత్రి 10గంటలకు గరుడ వాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత గోనెగండ్ల జట్టు



గోనెగండ్ల జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

యాడికి: శివలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం ముంగిట నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో కర్నూలు జిల్లా గోనెగండ్ల జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. శనివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత గోనెగండ్ల జట్టుకు జేసీ నారాయణరెడ్డి, కోన లక్ష్మీనారాయణరెడ్డి రూ.20వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన తాడిపత్రి జట్టుకు యాడికి మహమ్మద్‌బాషా రూ.15వేలు, తృతీయస్థానంలో నిలిచిన గుంతకల్లు జట్టుకు కడ్డీల నాగేంద్ర రూ.10 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన యాడికి జట్టుకు ఎంపీటీసీ సభ్యుడు కోటి చిన్న వెంకటరాముడు రూ.5 వేల నగదు బహుమతిని బొంబాయి రమేష్‌నాయుడు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొంబాయి రామిరెడ్డి, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు నాగరాజు, రామ్మోహన్, వెంకటరాముడు వార్డు మెంబర్ తిరుపతి పాల్గొన్నారు.

డిజిటల్ విధానంలో పరీక్ష బాగుంది



డిజిటల్ విధానంలో పరీక్ష గురించి ఆరా తీస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

రాప్తాడు: దృష్టిలోపం కలిగిన విద్యార్థులు సహాయకుల (స్క్రైబ్) అవసరం లేకుండా ల్యాప్‌టాప్ సాయంతో డిజిటల్ విధానంలో పరీక్షలు రాయడం చాలా బాగుందని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ప్రశంసించారు. రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను శుక్రవారం ఆయన ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈఓ వరలక్ష్మితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే కేంద్రంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) అంధుల ఉన్నత పాఠశాల (ఇన్‌క్లూజివ్)కు చెందిన 13 మంది విద్యార్థులు స్క్రైబ్ అవసరం లేకుండా ల్యాప్‌టాప్ సాయంతో డిజిటల్ విధానంలో రాస్తున్న పరీక్షను పరిశీలించారు. ల్యాప్‌టాప్‌లో ప్రశ్నపత్రాన్ని హెడ్‌ఫోన్ల ద్వారా విని, జవాబు టైప్ చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా ప్రశ్నలు వినిపించకపోతే చదివి వినిపించేందుకు రీడర్లను సైతం ఏర్పాటు చేశారని విద్యార్థులు తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ దేశంలోనే ప్రప్రథమంగా రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది నుంచి అంధ విద్యార్థులకు సహాయకులు లేకుండా ల్యాప్‌టాప్ సాయంతో పరీక్షలు రాసే డిజిటల్ విధానం అందుబాటులోకి తేవడం గొప్ప విషయమన్నారు. తొలి ఏడాది ఆరుగురు అంధ విద్యార్థులు ఈ విధానంలో పరీక్ష రాసి అందరూ పాసయ్యారన్నారు. ఈ ఏడాది 13 మంది విద్యార్థులు డిజిటల్ విధానంలో పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి అంధ విద్యార్థులందరికీ డిజిటల్ విధానంలోనే పరీక్షలు రాసేలా చూస్తామని చెప్పారు.

ఏపీ మోడల్ స్కూల్ తనిఖీ

పంగల్ రోడ్డు సమీపంలోని మోడల్ స్కూల్‌ను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు.

గుమ్మనూరు జయరామ్‌కు సహకరించం

- కురుబ సంఘం నాయకుల స్పష్టీకరణ



మాట్లాడుతున్న కురుబ సంఘం నాయకులు

గుంతకల్లు: టీడీపీ తరపున గుంతకల్లు అసెంబ్లీ టికెట్‌ను గుమ్మనూరు జయరామ్‌కు కేటాయిస్తే సహకరించేది లేదని పట్టణ కురుబ సంఘం నాయకులు స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కురవ సాధికరత జిల్లా అధ్యక్షుడు కురుబ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు పాలమల్లికార్జున, సీనియర్ నాయకుడు శివప్ప, వశికేరి, కదిరప్ప, సుధాకర్‌యాదవ్ తదితరులు మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న గుంతకల్లు నియోజవర్గంలో మాజీ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు చోటు లేదన్నారు. ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడిన జితేంద్రగౌడ్‌ను కాదని గుమ్మనూర్‌కు టికెట్ కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోందని, ఒక వేళ ఆయనకు టికెట్ కేటాయిస్తే కురుబలు ఎట్టి పరిస్థితిలోనూ టీడీపీకి ఓటు వేయరని, ఈ విషయాన్ని పార్టీ అధినేత చంద్రబాబు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

మెరుగైన సేవలందించాలి

అనంతపురం క్రైం: ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని ఆర్టీసీ ఉద్యోగులకు రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సూచించారు. శనివారం రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఆయన జిల్లాలోని డిపో మేనేజర్లు, డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జీల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బస్ సర్వీసు పనితీరుతో పాటు షెడ్యూల్ సమయం ప్రయాణికులకు అనుగుణంగా మార్పులు చేయాలన్నారు. సెక్టార్ వారీగా పనితీరు బాగా లేని సర్వీసులను పరిశీలించి రీ షెడ్యూల్ చేయాలని సూచించారు. కార్గో బిజినెస్ అభివృద్ధిపరిచేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్గోలో స్వీకరించిన వస్తువులను వెంటనే డెలివరీ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు, ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలన్నారు. అన్ని డిపోలలో ప్రమాదాలు నియంత్రించేందుకు డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. బ్రేక్ డౌన్ తగ్గించి ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే ధ్యేయంగా పని చేయాలన్నారు. సమీక్షలో డిప్యూటీ సీటీఎం రమేష్ బాబు, డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్, డిపో మేనేజర్లు నాగభూపాల్, శంకర్, రామచంద్ర, సురేష్ కుమార్, నారాయణస్వామి, సి.బాలాజీ దయాళ్, పి.ఓ.చంద్రాయుడు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఓ.రమణమ్మ, ఆర్ఎం ఆఫీస్ ఏఓ నాగర్జున, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

'పల్లె' కళాశాల బస్సు ఢీ.. ఇద్దరి దుర్మరణం





ప్రమాదానికి కారణమైన బస్సు, ఘటనాస్థలిలో పడి ఉన్న మృతదేహాలు (ఇన్‌సెట్) ఏశోబు, బండెన్న (ఫైల్)

బుక్కరాయసముద్రం: టీడీపీ నేత పల్లె రఘునాథరెడ్డి కళాశాలకు చెందిన బస్సు ఢీకొని ఇద్దరు కూలీలు దుర్మరణం పాలైన ఘటన మండల పరిధిలోని రోటరీపురం గ్రామం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం బలపన గూడూర్ గ్రామానికి చెందిన ఏశోబు (34), బండెన్న (41)లు నిరుపేదలు. బేల్దారీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కూలి నిమిత్తం రెండు రోజుల క్రితం బైకులో అనంతపురం వచ్చారు. పనులు పూర్తి కావడంతో శనివారం స్వగ్రామానికి బయలుదేరారు. రోటరీపురం గ్రామ సమీపంలో వెళ్తుండగా, పల్లె రఘునాథరెడ్డికి చెందిన కళాశాల బస్సు ఎదురుగా వేగంగా దూసుకొచ్చి వీరి బైకును ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన ఏశోబు, బండెన్న ఘటనాస్థలంలోనే ప్రాణాలు విడిచారు. రోటరీపురం సమీపంలో రహదారి పనులు జరుగుతున్నా లెక్కచేయక నిర్లక్ష్యంగా బస్సు నడపడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏశోబుకు భార్య, ఇద్దరు కుమారులు, బండెన్నకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చిరుధాన్యాలకు డిమాండ్

బుక్కరాయసముద్రం: చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాకు మార్కెట్‌లో మంచి ఆదరణ, డిమాండ్ ఉందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లీశ్వరి పేర్కొన్నారు. శనివారం కృషి విజ్ఞాన కేంద్రంలో చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై వారం రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు వివిధ బేకరీ ఉత్పత్తులు, వివిధ రకాల వంటలపై అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు వంటల తయారీ పుస్తకాలతో పాటు ఆత్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ మహిళలు నైపుణ్యాలతో జీవనోపాధులు పెంపొందించుకోవాలన్నారు. చిరు ధాన్యాల ఆహారం తీసుకోవడం వలన మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: మండలంలోని బి.యాలేరు గ్రామానికి చెందిన పెద్దక్క అనే మహిళ విద్యుత్ షాక్‌తో రెండు రోజుల క్రితం మరణించిన విషయం తెలిసిందే. పెద్దక్క మృతదేహానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శనివారం మండల వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో తోపుదుర్తి బ్రదర్స్ తరపున పెద్దక్క భర్తకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శంకర్‌నారాయణరెడ్డి (చిన్నా) వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, ఎర్రిస్వామి, మహేష్, ఈశ్వరయ్య, నరసింహుడు, నల్లప్ప, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపులు

అనంతపురం కార్పొరేషన్: సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈనెల 24న ఆదివారం, 25 హోలీ పండుగ సెలవు రోజున నగరపాలక సంస్థలో పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కౌంటర్లలో పన్ను చెల్లించవచ్చన్నారు. వడ్డీ మాఫీకి మరో 8 రోజులు మాత్రమే గడువు ఉందని గుర్తు చేశారు. అసెస్‌మెంట్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

- కమిషనర్ మేఘ స్వరూప్



పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని పారిశుధ్య కార్యదర్శులు, తదితర సిబ్బందిని కమిషనర్ మేఘ స్వరూప్ హెచ్చరించారు. శనివారం నగరంలోని విద్యుత్‌నగర్, ఆదర్శనగర్, శారదానగర్, ఆర్టీఓ ఆఫీస్ రోడ్డు, జేఎన్‌టీయూ రోడ్డు, విజయనగర్ కాలనీ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. హమాలీ కాలనీల్లో ఖాళీ ప్రదేశాల్లో ఎక్కువ చెత్త పడి ఉండటంతో సంబంధిత సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై చెత్త కన్పించకూడదన్నారు. పారిశుధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంకా ఎక్కడైనా అపరిశుభ్రంగా ఉంటే సంబంధిత సచివాలయ సిబ్బంది, ప్రజారోగ్య సిబ్బందికి ఫిర్యాదు చేయాలన్నారు.

గ్రామాల్లో అలజడి సృష్టిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

ఆత్మకూరు: ఎన్నికల వేళ గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని సనప గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల నాయకులు స్నేహపూర్వకంగా ప్రచారం చేసుకోవాలన్నారు. వ్యక్తిగతంగా తీసుకుని గొడవలు సృష్టించరాదని తెలిపారు. ఐదు సంవత్సరాలకు ఒక సారి వచ్చే ఎన్నికల కోసం కలసి ఉండే ప్రజలు గొడవలు పడాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే ప్రతి ఎన్నికలకు బైండోవర్ కావాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మునీర్ అహమమ్మద్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



ప్రమీల (ఫైల్)

అనంతపురం: నగరంలోని వినాయక నగర్‌లో నివాసం ఉంటున్న ప్రమీల (56) అనే మహిళ అదృశ్యమైంది. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని సీఐ రెడ్డప్ప సూచించారు.

ప్రశాంత నగరంగా మార్చాం

- గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు
- సంక్షేమం, అభివృద్ధే మా లక్ష్యం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 47వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో వర్గపోరుతో ప్రజాప్రతినిధులే రోడ్లెక్కే దారుణమైన పరిస్థితులు ఉండేవి. అలజడి వాతావరణంతో ప్రజలు సైతం ఆందోళనకు గురైన సందర్భాలు చాలా చూశాం. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అనంతపురాన్ని ప్రశాంత నగరంగా మార్చామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని 47వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన మేలు, నగరాభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి అందించడమే లక్ష్యంగా తాము ముందుకెళ్లామన్నారు. ఇప్పటికే మూడు, నాలుగు సార్లు నియోజకవర్గంలో ప్రజల వద్దకు వెళ్లడం జరిగిందన్నారు. వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందని తెలిపారు.

ఎన్నికల ముందు మాత్రమే కన్పించేవారు

గత ప్రభుత్వాల్లో ప్రజాప్రతినిధులు, తదితరులు కేవలం ఎన్నికలు ముందు మాత్రమే ఇళ్లకు వద్దకు వెళ్లే పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు అనునిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యను తెలుసుకుని పరిష్కార మార్గాలను చూపిస్తున్నామన్నారు. ప్రజల బాగోగుల కోసం ఆలోచిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముందుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. నగర శివారు, మురికివాడల్లోనూ రూ.కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రాణినగర్, మున్నానగర్, మోమిన్ స్ట్రీట్, ఆసార్ వీధిలాంటి ఇరుకు ప్రాంతాల్లోనూ ప్రజలకు రాకపోకలు సులభంగా ఉండేందుకు రోడ్లు వేయించామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం, నగరపాలక సంస్థ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం, ఎన్ క్యాప్, సీఎం ప్రత్యేక నిధులు, తదితర నిధులతో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, ఆర్టీసీ రీజనల్ బోర్డు చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, కార్పొరేటర్లు దుర్గాదేవి, కమల్‌భూషణ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్లునాయకులు రామయ్య, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, వనారస బలరాం, జయచంద్ర నాయుడు, నీలూరు సురేష్, రామచంద్ర, రాజారత్నం, జావెద్, జానీ, భారతి, ఉష, రాధా, పార్వతి, దేవి, అనిత, అనిల్‌కుమార్ గౌడ్, తానీషా పాల్గొన్నారు.

నేడు 1వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 1వ డివిజన్‌లో ఆదివారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎర్రనేల కొట్టాల ఆటో స్టాండ్ వద్ద నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు రావాలన్నారు.

ఆకట్టుకున్న అష్టావధానం



అష్టావధానంలో పాల్గొన్న కవులు

అనంతపురం కల్చరల్: వినూత్నంగా సాగిన సంస్కృతాంధ్ర ద్విగుతాష్టావధానం అందరినీ ఆకట్టుకుంది. ధర్మయాత్రంలో భాగంగా అనంతకు విచ్చేసిన శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ తీర్థ స్వామి సమక్షంలో శనివారం రాత్రి శతావధాని బ్రహ్మశ్రీ గన్నవరం లలితాదిత్య ఆధ్వర్యంలో అవధానం సాగింది. పృచ్ఛకులు పలు ఆధ్యాత్మిక, వైజ్ఞానిక విషయాలపై అడిగిన ప్రశ్నలకు చమత్కారపూరిత సమాధానాలు, పద్యపూరణలతో ఆలోచనాత్మకంగా సాగిన అష్టావధానం శుభపరిణామమని స్వామీజీ అన్నారు. ఉదయం జగద్గురువుల సన్నిధానం శృంగేరీ శంకర మఠంలో ప్రతిష్ఠాం గహోమం, దర్శనం, పాదపూజల్లో విధుశేఖరభారతీ తీర్థస్వామిజీ పాల్గొన్నారు. సాయంత్రం పాతూరులోని ప్రాచీన దత్తాత్రేయస్వామి ఆలయంలో గురుదత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఆర్ ఐటీ వద్ద నిర్మించిన సత్యసాయి సమేత వివిధ దేవతామూర్తుల సన్నిధిలో స్వామీజీ పాల్గొన్నారు. అనంతరం శంకరమఠంలో జరిగిన సమావేశంలో స్వామీజీ అనుగ్రహభాషణంలో ఈశ్వరతత్తం, నైతిక విలువల గురించి బోధించారు. శంకర జయంతి సందర్భంగా సాగే సామూహిక దర్మోపనయాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదివారం జరిగే మహాకుంభాభిషేక వేడుకల్లో భక్తులు పాల్గొనాలని నిర్వాహకుడు సత్యప్రసాద్ కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి



శివపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు



నరసనాయనికుంటలో ప్రచారం చేస్తున్న దృశ్యం

కనగానపల్లి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. మండలంలోని శివపురం గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. నవరత్నాల్లోని పథకాలు నిరంతరంగా అందాలంటే తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, దృశ, కళల అకాడమీ స్టేట్ డైరక్టర్ ప్రభాకర్, మండల అగ్రీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు, స్థానిక ఎంపీటీసీ ఆదినారాయణ రెడ్డి, సర్పంచ్ అంజినప్ప, నాయకులు రామలింగారెడ్డి, దాదాఖలందర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ప్రతి ఇంటికీ పథకాలు అందుతాయని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనుంజయ యాదవ్, ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యులు చంద్రకుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్ అన్నారు. శనివారం అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పేదల బాగోగులు ఆలోచించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యతపై అందరిపై ఉందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో సంక్షేమ పథకాలు అందాలంటే ఎన్ని ఇబ్బందులు పడ్డారో ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. జన్మభూమి కమిటీల సభ్యుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. కేవలం టీడీపీ కార్యకర్తలకు, టీడీపీ జెండాలు మోసేవారికి మాత్రమే పథకాలు అందాయని తెలిపారు. అదే జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుంటే పేదలు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇద్దరికీ రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్బిరెడ్డి, బండా అంజియాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మీ, నాయకులు కొడిమి పవన్, తిరుపాల్‌రెడ్డి, సుబ్బరాయుడు, అశ్వర్థనారాయణ, రామాంజనేయులు నాయక్, గువ్వల అంజనాదేవి, సుంకన్న, ఆనంద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మసీద్ ఏ రజాలో ఇఫ్తార్ విందు



ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని ఉపవాస దీక్షలతో స్ఫూర్తిని చాటుకుంటారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి భాగ్యనగర్‌లోని మసీద్ ఏ రజాలో ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం సలీం ముఖ్య అతిథులుగా పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో చేసే ప్రతి పుణ్యకార్యం ఎంతో ప్రతిఫలం ఇస్తుందన్నారు. నగరంలో కులమతాలకతీతంగా ఇఫ్తార్‌లో పాల్గొనడం శుభదాయకమన్నారు. అన్ని వర్గాల వారు ముస్లింలను సోదరులుగా భావిస్తారని ముఖ్యంగా రంజాన్ వంటి పవిత్ర దినాలొచ్చినపుడు సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుందన్నారు. అందరూ సమాజం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేయాలని కోరారు. అనంత వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యేగా మరోసారి గెలవాలని పలువురు ముస్లింలు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, జిల్లా వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, కార్పొరేటర్ రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మన్న, హనుమంతరెడ్డి, నరసింహ, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించం



మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: భవన నిర్మాణ అతిక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నిర్మాణదారులు, లైసెన్స్ ఇంజినీర్లను కమిషనర్ మేఘ స్వరూప్ హెచ్చరించారు. శనివారం నగరపాలక సంస్థలో పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు లోబడి నిర్మాణాలు జరగాల్సిందేనన్నారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్లాన్‌లో నిర్మాణం ఒకలా పొందుపర్చి.. నిర్మాణంలో అతిక్రమణలు చేపడితే మాత్రం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పట్టణ ప్రణాళిక కార్యదర్శులు మీ పరిధిలో జరిగే నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నగరపాలక సంస్థ అనుమతులతో నిర్మాణాలు చేపడుతున్నారని, ఒక వేళ ప్లాన్‌కు విరుద్ధంగా చేపడుతున్నారా లేదా అని ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలన్నారు. మాస్టర్ ప్లాన్ అలైన్‌మెంట్ కానీ, సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్డు విస్తరణలో ఎటువంటి నిర్మాణం చేసినా.. నిర్ణీత ఎత్తు మించినా చట్టరీత్యా చర్యలు చేపట్టాలన్నారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలన్నారు. ప్రణాళిక విభాగానికి సంబంధించి నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కల్గి ఉండాలన్నారు. విధి నిర్వహణలో భాగంగా అనధికార, అక్రమ కట్టణ నిర్మాణ నిలుపుదలలో ఎవరైనా వ్యక్తుల నుంచి కానీ ఎటువంటి సమస్య వచ్చినా తక్షణం తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఏసీపీ మారుతీ హరిప్రసాద్, టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, తదితరులు పాల్గొన్నారు.

సిగరెట్ కొని.. బంగారు గొలుసుతో ఉడాయించి

అనంతపురం: సిగరెట్ కొనుగోలు చేసిన వ్యక్తి దుకాణదారు మెడలోని బంగారు గొలుసు లాక్కొని ఉడాయించిన ఘటన శనివారం అనంతపురంలో జరిగింది. నగరంలోని శారదానగర్ వద్ద శ్రీసత్య సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయర్ లర్నింగ్ (మహిళా) కళాశాల ఎదురుగా సరోజన అనే వృద్ధురాలు కిరాణాషాపు నిర్వహిస్తోంది. శనివారం ఉదయం 8 గంటలకు ఒక వ్యక్తి వచ్చి సిగరెట్ కొనుగోలు చేసి షాపు ముందే కూర్చున్నాడు. చాలాసేపు అక్కడే కూర్చుని ఉండడంతో సరోజ ప్రశ్నించింది. తన కోసం మరొక వ్యక్తి వస్తారని, అందుకే కూర్చున్నానని అతడు బదులిచ్చాడు. తర్వాత ఆమె షాపు ముందు శుభ్రం చేస్తున్న సమయంలో మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును ఆ వ్యక్తి లాక్కున్నాడు. హతాశురాలైన వృద్ధురాలు గట్టిగా కేకలు వేసినప్పటికీ స్థానికులు అక్కడికి చేరుకునేలోగా బైక్‌పై తుర్రుమన్నాడు. డీఎస్పీ వీరరాఘవ రెడ్డి, ఒన్‌టౌన్ సీఐ వి.రెడ్డప్ప సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల కవాతు

కనగానపల్లి(రామగిరి): శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలతో రామగిరి మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలైన నసనకోట, కలికివాండ్లపల్లిలో శనివారం కవాతు (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించినట్లు రామగిరి సీఐ శివాంజినేయులు తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. స్థానిక రచ్చబండల వద్ద ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు, శాంతిభద్రతలపై వివరించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడులో ప్రకాష్‌రెడ్డి విజయం తథ్యం

- తలుపూరులో వైఎస్సార్‌సీపీ నాయకుల ఎన్నికల ప్రచారం



ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: రానున్న ఎన్నికల్లో ప్రకాష్‌రెడ్డి విజయం తథ్యమని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని తలుపూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. నవరత్నాల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందాయని తెలిపారు. అంతేకాకుండా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేరూరు డ్యాంకు నీరు తీసుకువచ్చారని గుర్తు చేశారు. రూ.117 కోట్లతో పీఏబీఆర్ డ్యాం నుంచి ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. రైతులకు ఉచిత బోర్లు, అమ్మ డెయిరీ వంటి ఎన్నో మంచి పనులు చేశారని కొనియాడారు. అభివృద్ధికే పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాప్తాడు నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేయద్దామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, సర్పంచ్ ఓబులేసు, ఎంపీటీసీ ఓబులేష్ నాయకులు వాసుదేవరెడ్డి, వీరాంజనేయులు, శ్రీరామిరెడ్డి, సుబ్బారెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, కొండా, అతిక్‌రెడ్డి, ఓబిరెడ్డి, రమణారెడ్డి, శివయ్య, వెంకట్రాముడు, నాగరాజు, ఈశ్వర్‌రెడ్డి, భాను, శివారెడ్డి, సుధీర్, సద్దికూటి శివారెడ్డి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సబిహా సుల్తానా

ఆత్మకూరు: ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సబిహా సుల్తానా సూచించారు. శనివారం మండలంలోని సనప గ్రామంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. మనిషికి ఎక్కువగా చమటలు పట్టడం, నాలుక ఆరిపోయట్టు ఉండటం, తీవ్రమైన తలనొప్పి, జ్వరం, వాంతులు విరేచనాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో ఎక్కువగా తిరగకుండా ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో బయటకు వెళ్తే గొడుగు తీసుకెళ్లాలన్నారు. అనవసరంగా బయట తిరగొద్దన్నారు. కాటన్ దుస్తులు ధరించి, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మాంసాహారం, నూనె వస్తువులు పూర్తిగా తగ్గించాలన్నారు. కొబ్బరి నీరు, మజ్జిగ, వంటి పానీయాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారు వెంటనే దగ్గర్లోని ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ దేవకుమార్

అనంతపురం: సామాజిక సేవలో భాగస్వాములవ్వాలని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెక్రెటరీ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో వర్సిటీకి చెందిన 113 మంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు ప్రణాళిక శిక్షణ, సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ట్రైనింగ్, ప్లానింగ్ , రివ్యూ వంటి తదితర అంశాలపై చర్చించారు. వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. ఎస్కేయూ ప్రొఫెసర్ జీవీ రమణ మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో అందరికీ సాయపడాలన్నారు. ముఖ్యంగా అన్నదానం, రక్తదానం, అనాథ, వృద్ధులకు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



శివబాలయోగి ఆశ్రమంలో నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: పవిత్ర పాల్గుణ మాసంలో వచ్చే శనిత్రయోదశి వేడుకలు పలు చోట్ల వైభవంగా జరిగాయి. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన శనేశ్వరుడు ప్రత్యేక పూజలందుకున్నాడు. శనివారం ఉదయం నుంచే శివబాలయోగి ఆశ్రమంలో భక్తుల సందడి నెలకొంది. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు నవగ్రహాల పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్ ఆధ్వర్యంలో శనేశ్వరుడికి తైలాభిషేకాలు, నవగ్రహ దోష నివారణ పూజలు జరిగాయి. అలాగే మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, శివకోటి తదితర చోట్ల భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి వేడుకలు జరిగాయి. తైలాభిషేకాల్లో పాల్గొన్న భక్తులు నవగ్రహాస్తోత్రాలతో స్వామిని స్తుతించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

అనంతపురం అర్బన్: విప్లవ వీరుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజాసమస్యలపై యువత ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టీవీటవర్ సమీపంలోని కొత్తకాలనీలో కమిటీ కార్యదర్శి ఆర్‌వీ నాయుడు అధ్యక్షతన భగత్‌సింగ్ 92వ జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇల్లు, బట్ట, తిండి దక్కాలంటే బ్రిటీష్ పాలన నుంచి దేశానికి విముక్తి కావాలని భగత్ సింగ్ ఉద్యమించారన్నారు. దేశం విముక్తి కోసం భగత్‌సింగ్ అనన్య సామాన్యమైన పోరాటం నిర్వహించారన్నారు. భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని యువత పోరాటాలు సాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, ఇర్ఫాన్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల నుంచి నగదు స్వాధీనం

అనంతపురం: నగరంలోని సంగమేష్ సర్కిల్‌లో మట్కా బీటర్ల నుంచి రూ.27,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ వి.రెడ్డప్ప తెలిపారు. మట్కా నిర్వహిస్తున్న ఇద్దరికి అరెస్ట్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

వైరల్




నా స్టూడెంట్ టీచర్ అయింది!

‘ఎక్స్’లో రేవ్ అనే టీచర్ తన స్టూడెంట్ ఆలిషా గురించి చేసిన పోస్ట్ వైరల్ అయింది. స్కూల్ రోజుల్లో ఆలీషా అల్లరిపిల్ల. రేవ్ మాటల్లోనే చెప్పాలంటే రెబెల్. ‘ఈ అమ్మాయి భవిష్యత్ ఎలా ఉండబోతుందో’ అంటూ ఆలీషా గురించి బెంగపడేది రేవ్. కట్ చేస్తే... ఆలిషా ఇప్పుడు ముంబైలోని ఒక స్కూల్‌లో స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్స్‌కు టీచర్. ‘మొండిఘటం. ఏ పనీ చేయలేదు... అని నా గురించి రేవ్ టీచర్‌కు చెప్పేవారు. అయితే టీచర్ మాత్రం నన్ను ఎప్పుడూ ప్రేమగా చూసుకునేది. అలాంటి ప్రేమను స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్స్‌కు పంచాలనుకుంటున్నాను’ అంటుంది అలీషా.



ఈ హోలీ రంగులను హాయిగా తినవచ్చు!

ముంబైకి చెందిన ఇద్దరు సోదరుల ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ నెటిజనులను ఆకట్టుకుంటోంది. గౌరంగ్, సౌరభ్ అనే సోదరులు ‘మాంక్స్ బూఫీ’ బ్రాండ్‌పై ‘అబీర్ హోలి కలర్స్’ పేరుతో సహజ రంగులను మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. పువ్వులు, మొక్కజొన్న పిండి... మొదలైన వాటితో భిల్ తెగ గిరిజనులు తయారు చేసిన ఈ రంగులను తినవచ్చు కూడా!



లియాండర్ పేస్... ప్రముఖ డ్యాన్సర్!

‘ఎక్స్’యూజర్ పృథ్వీ తన చిన్నారి మేనకోడలు వర్క్‌బుక్ నుంచి పోస్ట్ చేసిన స్నాప్‌చాట్ నెట్‌లోకంలో నవ్వులు పూయిస్తోంది. ఈ వర్క్ బుక్‌లో‘మ్యాచ్ ది ఫాలోయింగ్’ శీర్షిక కింద ఎడమవైపు ప్రముఖుల పేరు, కుడివైపు ఆయా రంగాలకు సంబంధించిన బొమ్మలు ఇచ్చారు. ఏ వ్యక్తి ఏ రంగానికి చెందిన వారో జత చేయాలి. విరాట్ కోహ్లీ–క్రికెటర్, లతా మంగేష్కర్–సింగర్... ఇలా అన్నిటికీ కరెక్ట్‌గానే జత చేసింది ఆరు సంవత్సరాల చిన్నారి. అయితే లియాండర్ పేస్ దగ్గరే వచ్చింది పేచీ. ప్రభుదేవాతో పాటు లియాండర్ పేస్‌ను కూడా డ్యాన్సర్‌ని చేసింది. ఇది చూసి సరదాకారులు ఊరుకుంటారా ఏమిటి? మీమ్సే మీమ్స్!

వేడి వేడి ప్రెషర్ కుకర్ ఉండగా... ఐరన్ బాక్స్ దండగా

‘లిమిటెడ్ రీసోర్స్ నుంచే కొత్త ఐడియాలు జనించునోయి’ అని మరో సారి చెప్పడానికి ఈ వైరల్ వీడియో క్లిప్ సాక్ష్యం. కోల్‌కతాకు చెందిన మౌమితా చక్రవర్తి వేడి వేడి ప్రెషర్ కుక్కర్‌ను ఉపయోగించి షర్ట్‌ను ఐరన్ చేస్తున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ట్విట్టర్‌లో రీపోస్ట్ చేసిన ఈ వీడియో రెండు లక్షల యాభై వేల వ్యూస్‌ను దాటింది.





లవ్ స్కానింగ్

ముంబైలోని మహాలక్ష్మి రేస్‌కోర్స్ ప్రాంతంలో జరిగిన మ్యూజిక్ ప్రోగ్రామ్‌కు హాజరైన ఒక యువకుడి టీ షర్ట్ అందరి దృష్టిని ఆకర్షించింది. 22 సంవత్సరాల హార్థిక్ టీ షర్ట్ వెనకాల ఐ–క్యాచింగ్ మెసేజ్ ‘ఫర్ సింగిల్ పీపుల్ వోన్లీ’తోపాటు క్యూ ఆర్ కూడా ఉంది. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే నేరుగా అతడి టిండర్ ప్రొఫైల్‌లోకి తీసుకువెళుతుంది. హార్థిక్ డిజిటల్ ఫ్లర్టింగ్ అనేది టాకింగ్ పాయింట్ కావడమే కాదు సోషల్ మీడియాలో వైరల్ అయింది

బయోపిక్

సినిమాలు పాత కథలను తవ్వి పోస్తున్నాయి.
చరిత్ర గతిని వెండి తెర మీద పునఃసృష్టిస్తున్నాయి.
స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో ఘట్టాలు. ఎందరో త్యాగమూర్తులు.
కాని పురుషుల బయోపిక్‌లు వచ్చినట్టుగా స్త్రీలవి రాలేదు.
తాజాగా విడుదలైన ‘అయ్ వతన్ మేరే వతన్’ సినిమా
నాటి వీర వనిత ఉషా మెహతా జీవితాన్ని చూపింది.
బ్రిటిష్‌కు వ్యతిరేకంగా సీక్రెట్ రేడియో నడిపిన ఉషా మెహతా ఎవరు?

వెండి తెర మీద రహస్య రేడియో


ఉషా మెహతా

‘దిసీజ్ కాంగ్రెస్ రేడియో కాలింగ్ ఆన్ 42.34 మీటర్స్ సమ్‌వేర్ ఇన్ ఇండియా’... ఈ అనౌన్స్‌మెంట్ బ్రిటిష్ వారిని గడగడలాడించింది. మునికాళ్ల మీద పరిగెత్తించింది. ఒక బుల్లి రహస్య రేడియో స్టేషన్‌ని, దాని నిర్వాహకులను అరెస్ట్ చేయడానికి పిచ్చెక్కినట్టు తిరిగేలా చేసింది. మూడు నెలల పాటు బ్రిటిష్‌వారిని ముప్పుతిప్పలు పెట్టిన ఆ రేడియో నిర్వాహకురాలి పేరు ఉషా మెహతా.

గాంధీ పిలుపు విని...

ఉషా మెహతా గుజరాత్‌లోని సూరత్ సమీపంలో ఉన్న సారస్ అనే ఊళ్లో 1920లో జన్మించింది. ఐదేళ్ల వయసులో గాంధీజీని అహ్మదాబాద్‌లో చూసింది. 8 ఏళ్ల వయసులో వాళ్ల ఊరి దగ్గర గాంధీజీ చరఖా కార్యక్రమం నిర్వహిస్తే ఉషా పాల్గొని కొద్దిసేపు చరఖా తిప్పింది. బాల్యంలోనే గాంధీజీ మీద గొప్ప భక్తి పెంచుకున్న ఉషా 12 ఏళ్ల వయసులో తండ్రి వృత్తిరీత్యా బొంబాయికి మారడంతో తన దేశభక్తిని చాటుకునే అవకాశం పొందింది.

డూ ఆర్ డై

1942 ఆగస్టు 8న బొంబాయిలో గాంధీజీ క్విట్ ఇండియా పిలుపునిచ్చారు. ‘డూ ఆర్ డై’ లేదా ‘కరో యా మరో’ నినాదాలు మిన్నంటాయి. ‘ఇక భారత ప్రజలు నాయకుల కోసం ఎదురు చూడొద్దు. ప్రజలే నాయకులు’ అని గాంధీజీ పిలుపునిచ్చారు. 22 ఏళ్ల ఉషా మెహతా తన స్నేహితులైన విఠల్ దాస్ ఖాకడ్, చంద్రకాంత్ ఝవేరీ, బాబూభాయ్ ఠక్కర్‌లతో కలిసి ఆ మీటింగ్‌కు వెళ్లింది. ఉత్తేజితురాలైంది. అప్పటికే స్వతంత్రోద్యమ వార్తల మీద బ్రిటిష్ ప్రభుత్వం నిషేధం విధించింది. ఉద్యమం ఉధృతం కావాలంటే రేడియో మాధ్యమం ద్వారా వార్తలు అందించాల్సిన అవసరం ఉందని ఉషా మెహతా తన స్నేహితులతో చెప్పింది. దేశం కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడాలని పిలుపునిచ్చింది.


‘అయ్ వతన్ మేరే వతన్’లో సారా అలీఖాన్

రహస్య కాంగ్రెస్ రేడియో

బ్రిటిష్ ప్రభుత్వంలో జడ్జిగా పని చేస్తున్న తండ్రి నివారించినా వినకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఉషా బొంబాయిలో షికాగో రేడియో ట్రాన్స్‌మిషన్‌ను చూస్తున్న మరో మిత్రుడు మోత్వాని సహాయంతో సొంత ట్రాన్స్‌మిటర్‌ను సంపాదించింది. మిత్రులతో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకుని రేడియో స్టేషన్‌గా మలిచింది. ఆగస్టు 27, 1942న మొదటి చరిత్రాత్మక ప్రసారాన్ని సొంత గొంతుతో చేసింది. ‘దిసీజ్ కాంగ్రెస్ రేడియో 42.34 మీటర్స్ సమ్‌వేర్ ఇన్ ఇండియా’... అంటూ స్వాతంత్రోద్యమ వార్తలు వినిపించింది. ఆ క్షణం నుంచి ఆ రహస్య రేడియో కోసం బ్రిటిష్ అధికారులు, పోలీసులు కంటి మీద కునుకు లేకుండా వెతకసాగారు. ప్రసారాలు బొంబాయి నుంచే నిర్వహిస్తున్నా దేశంలో ఎక్కడి నుంచి అవుతున్నాయో తెలియక గింజుకున్నారు.

మూడు నెలలు

రహస్య రేడియో ప్రసారాలు మూడు నెలలు సాగాయి. కాని పరికరాలు సమకూర్చిన మోత్వాని లొంగిపోయి రేడియో స్టేషన్ చిరునామా చెప్పేశాడు. నవంబర్ 12, 1942న పోలీసులు దాడి చేసి ఉషా మెహతాను అరెస్ట్ చేశారు. ఆరు నెలల పాటు ఆమెను ఇంటరాగేట్ చేశారు. 4 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఉషా ఏ మాత్రం జంకలేదు. 1946 నాటి మధ్యంతర ప్రభుత్వ హయాంలో మురార్జీ దేశాయ్ హోమ్ మినిస్టర్‌గా ఉండగా ఆమె విడుదల జరిగింది. కాని జైలు జీవితం ఆమె ఆరోగ్యాన్ని బాగా దెబ్బ తీసింది. బయటకు వచ్చాక ఆమె చదువు కొనసాగించి ముంబై యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి 1980లో రిటైర్ అయ్యింది. గాంధీజీ భావజాలాన్ని ప్రచారం చేస్తూ 2000 సంవత్సరంలో తుది శ్వాస విడిచింది.

ఉషా మెహతా జీవితం ఆధారంగా నిర్మించిన బయోపిక్ ‘అయ్ వతన్ మేరే వతన్’ అమేజాన్‌లో మార్చి 21న విడుదలైంది.

హెల్త్

వృత్తిపరమైన శబ్దాలు... వినికిడి సమస్యలు!

చెవులకు హెడ్‌ఫోన్స్ తగిలించుకుని... కళ్లను కంప్యూటర్ స్క్రీన్‌కు అప్పగించి గంటలు గంటలు ఉద్యోగం చేసే వాళ్లను ఐటీ ఆఫీసుల్లో చూస్తుంటాం. పైకి స్టయిలిష్‌గా కనిపించినా దీర్ఘకాలంలో ఇలాంటి ఉద్యోగాలు వినికిడి శక్తిని దెబ్బతీస్తాయి. ప్రకంపనలు నేరుగా చెవుల్లోకి చొచ్చుకెళ్ళి కర్ణభేరిని తాకుతుండటం వల్ల వినికిడి వ్యవస్థ (ఆడిటరీ సిస్టమ్)కు హాని జరిగే అవకాశాలు ఎక్కువ. వృత్తిపరంగా వచ్చే ఈ వినికిడి సమస్యల నివారణ, దానిని అధిగమించడం ఎలా అనే దానిపై అవగాహన కోసం ఈ కథనం.

పని ప్రదేశమంటే పట్టణాలు, నగరాల్లో రకరకాల వస్తు తయారీ పరిశ్రమలు, గనుల తవ్వకం, భారీ యంత్రసామగ్రి, ఉపకరణాల చప్పుళ్లే కాదు... పల్లెల్లోని వ్యవసాయ పనుల్లోనూ మోటర్ల వాడకం... వంటివి శబ్దాలకు కారణమై దీర్ఘకాలంలో వినికిడి సమస్యలకు దారితీసేవి. దీనికి తోడు నిశ్శబ్దంగా ఉండే పని ప్రదేశంలోనూ హెడ్‌ఫోన్స్, ఇయర్‌ఫోన్స్ వాడకమూ పెరగడంతో వినికిడి సమస్యలు వచ్చే అవకాశాలూ పెరిగాయి.



మరికొన్ని అంశాలు...

● **శబ్దాల తీవ్రత :** శబ్దాల తీవ్రత 85 డెసిబుల్స్‌కు మించడం.
● **శబ్దాలకు ఎక్స్‌పోజ్ అయ్యే వ్యవధి :** శబ్దాలకు ఎంత ఎక్కువగా ఎక్స్‌పోజ్ అయితే వినికిడి సమస్యకు అంతగా అవకాశం ఎక్కువ. ● తమ ప్రమేయం లేకుండానే మరికొన్ని అంశాలు కూడా వృత్తిపరమైన వినికిడి సమస్యకు కారణమవుతాయి. ఉదాహరణకు జన్యుపరంగా వచ్చే సమస్యల తోపాటు వయసు పెరుగుతున్న కొద్దీ వినికిడి శక్తి తగ్గడం వంటివి

వృత్తిపరమైన వినికిడి సమస్యలు ప్రభావాలూ - పర్యవసానాలు

● **కమ్యూనికేషన్స్ కష్టం కావడం :** మాటలు అర్థంగాక కమ్యూనికేషన్స్‌కు అవరోధాలు ఏర్పడతాయి. ఫలితంగా చేయాల్సిన పనులు కుంటుపడతాయి.
● **వృత్తిపరమైన సామర్థ్యాలు తగ్గడం :** వినికిడి సమస్యలు పెరగడంతో వృత్తిపరమైన సామర్థ్య లోపాలు కనిపిస్తాయి.
● **భద్రతలో ముప్పు :** కొన్ని శబ్దాలు వినిపించకపోవడం లేదా కొన్ని హెచ్చరికలను వినలేకపోవడంతో పని ప్రదేశంలో ప్రమాదాలకు గురికావడం, గాయపడటం వంటి ముప్పు ఉంటుంది.
● **మానసికమైన దుష్ప్రభావాలు :** తమకు సరిగా వినిపించడం లేదన్న వాస్తవం చాలామందిని సామాజిక ఒంటరితనంలోకి నెడుతుంది, యాంగ్జైటీ, డిప్రెషన్‌కు లోనవుతారు.

నివారణ...

వినికిడి సమస్యలు రెండు రకాలు. మొదటిది తాత్కాలికం. రెండోది శాశ్వతం. తాత్కాలిక సమస్య తగ్గేందుకు అవకాశాలు ఎక్కువే అయినా ఒకసారి వినికిడి సమస్య ఏర్పడితే అది పూర్తిగా నయం కావడం కష్టం. శాశ్వత వినికిడి సమస్యకు దారితీసే అవకాశాలు ఎక్కువ. అందుకే నివారణకు ముందు నుంచే తగిన చర్యలు తీసుకోవాలి. అవి...


డాక్టర్ మోగంటి అశోక్ పృథ్వీరాజు, కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్

● **ఇంజనీరింగ్ కంట్రోల్స్‌తో :** శబ్దాలు తక్కువగా వచ్చేలాంటి యంత్రాల రూపకల్పన, ఆ మేరకు మార్పులు, సౌండ్‌ప్రూఫింగ్, మెటీరియల్ మార్చడం ద్వారా తక్కువ శబ్దాలు వచ్చే ఉపకరణాల తయారీ వంటి జాగ్రత్తలు పాటించడం.
● **వ్యక్తిగతమైన రక్షణ ఉపకరణాలు :** శబ్దాల విపరీతంగా వినిపించే చోట చెవులను రక్షించే కొన్ని సాధనాలు (ఉదాహరణకు ఇయర్ ప్లగ్స్ లాంటివి) వాడటం.
● **శిక్షణ – అవగాహనలు :** పెద్ద శబ్దాలతో చెవులు, వినికిడి విషయంలోనే గాక ఇతరత్రా ఆరోగ్య అంశాల్లో కలిగే చేటు వంటి అంశాలపై అవగాహన కల్పించడం, వాటి నివారణకు అవసరమైన చర్యల్లో శిక్షణ ఇవ్వడం, శబ్దాలను ఎలా నియంత్రించాలో తెలపడం, వినికిడి తగ్గినట్లుగా తెలుసుకునే లక్షణాలను గుర్తించడమెలా అన్న విషయంపై అవగాహన కల్పించడం, ఆ తర్వాత చేయాల్సిన పనులు, డాక్టర్లను కలవాల్సిందెప్పుడో తెలుసుకునేలా వివరించడం.

నిర్ధారణ పరీక్షలు...

ఆడిటరీ పరీక్షలు అని పిలిచే కొన్ని రకాల వినికిడి సామర్థ్య పరీక్షలతో పాటు మరికొన్ని ఇతరత్రా సాధారణ ఆరోగ్య పరీక్షలు.

చికిత్స...

● తాత్కాలిక వినికిడి సమస్యలు కలిగినప్పుడు వెంటనే డాక్టర్‌ను కలిస్తే వారు తగిన చర్యలను సూచించి, పరిస్థితి మరింత దిగజారకుండా చేస్తారు. ● కొన్నిసార్లు కాక్లియాలో సమస్యలు వచ్చినప్పుడు (సడన్ హియరింగ్ లాస్ లేదా కాక్లియార్ మైక్రో సర్క్యులేషన్ డిస్టర్బెన్సెస్ వంటి కేసుల్లో) కొన్ని రకాల స్టెరాయిడ్స్ ద్వారా వినికిడిని మెరుగుపరచేందుకు ప్రయత్నిస్తారు.
● కొన్ని రకాల వినికిడి సమస్యలకు తగిన వినికిడి ఉపకరణాలను బాధితులకు తగిన ఫ్రీక్వెన్సీలో అమర్చడం ద్వారా సమస్యను చక్కదిద్దుతారు. ● మరికొన్ని రకాల వినికిడి సమస్యలకు చివరి పరిష్కారంగా శస్త్రచికిత్స కూడా అవసరం పడవచ్చు.

మెడి టిప్

పాదాల నొప్పి తగ్గడం ఎలా?



మడమ కింది భాగం నుంచి కాళ్ల వేళ్ల వద్ద ఉండే ఎముకల వరకు... మొత్తం పాదాన్నంతా ‘ప్లాంటార్ ఫేషియా’ అంటారు. అది ఎముకనూ, కండరాలనూ కలుపుతుంది. దీనికి సాగే గుణం ఎక్కువ. ఈ ఫేషియాకు గాయం తగిలినా లేదా వయసు పెరిగే కొద్దీ ఫేషియా సాగే గుణం తగ్గడం వల్ల పాదాల నొప్పి రావడం సాధారణం.

పాదాల నొప్పుల తగ్గడానికి కొన్ని సూచనలు...

● పాదంపై పడే భారాన్ని బాగా తగ్గించి, తగినంత విశ్రాంతినివ్వాలి. ● పాదం మధ్యలో ఒంపు తిరిగి ఉన్న భాగానికి సపోర్ట్ ఇచ్చేలా ఉండే పాదరక్షలను ఎంచుకోవాలి. ● ఫేషియాను సాగేలా చేసేవీ, కాలి కండరాలను బలపరిచేవీ అయిన కొన్ని రకాల వ్యాయామాల సహాయంతో పాదాల నొప్పులు తగ్గుతాయి. ఈ సూచనలు పాటించాక కూడా నొప్పి తగ్గకపోతే అప్పుడు డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి.

ప్రతి మహిళా గర్భం ధరించినప్పటినుంచి కొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. మరికొన్ని గర్భవతి కాకముందే తీసుకోవాల్సినవీ ఉంటాయి. అలాగే గర్భవతులు అసలు తీసుకోకూడని వ్యాక్సిన్లు కూడా ఉండవచ్చు. అందుకే ఇన్ఫెక్షన్లు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన వ్యాక్సిన్ల గురించి మహిళలకు... ముఖ్యంగా కుటుంబ సభ్యులకు అవగాహన ఉండాలి. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) మార్గదర్శకాల ప్రకారం... గర్భిణులూ - వారు తీసుకోవాల్సిన వ్యాక్సిన్లపై అవగాహన కోసం ఈ కథనం.

గర్భిణులు... వ్యాక్సిన్‌లు!

ముందే తీసుకోవలసిన వ్యాక్సిన్లు

ప్రెగ్నెన్సీకి ప్లాన్ చేసుకున్నప్పుడే మీజిల్స్, మంప్స్, రుబెల్లా, చికెన్ పాక్స్ వంటి వ్యాక్సిన్లను తీసుకోవాలి. ఎందుకంటే గర్భం ధరించిన తర్వాత ఈ వ్యాక్సిన్లు తీసుకోవడం మంచిది కాదు. రొటీన్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా మీజిల్స్, మంప్స్, రుబెల్లా (ఎమ్ఎమ్ఆర్) వంటి వ్యాక్సిన్‌లను చిన్నప్పుడు తాము తీసుకున్నారా లేదా అనే సందేహం ఉంటే ఆ విషయాన్ని డాక్టర్‌తో తప్పక చెప్పాలి. అప్పుడు ఒక రక్తపరీక్ష ద్వారా ఆ మహిళ ముందుగానే ఎమ్ఎమ్ఆర్ వ్యాక్సిన్ తీసుకొని ఉన్నారా, లేదా నిర్ధారణ చేసి అంతకుముందు తీసుకుని ఉండకపోతే ఇస్తారు.

● **గర్భిణికి వారిసెల్లా (చికెన్‌పాక్స్) వైరస్** వల్ల బిడ్డలో పుట్టుకతోనే కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఒక చిన్న రక్తపరీక్షతో గతంలోనే చికెన్‌పాక్స్ వ్యాక్సిన్ తీసుకున్నారో లేదో తెలుసుకుని, తీసుకోకపోతే ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌కు నెల రోజుల ముందే దాన్ని తీసుకోవడం మంచిది.

● **హ్యూమన్ పాపిలోమా వైరస్:** హెచ్‌పీవీ అని పిలిచే ఈ వ్యాక్సిన్‌ను అమ్మాయిలు తమ పన్నెండేళ్ల వయసు నాటి నుంచి 45 ఏళ్ల వరకు ఎప్పుడైనా తీసుకోవచ్చు. అయితే గర్భం దాల్చకముందే దీన్ని తీసుకోవాలి. గర్భంతో ఉన్నప్పుడు తీసుకోకూడదు. అవసరమైతే ఆ తర్వాత (అంటే ప్రెగ్నెన్సీ లేని టైమ్‌లో) తీసుకోవచ్చు.

ప్రతి గర్భిణీ తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌లు...

● **ఇన్‌ఫ్లుయెంజా (ఫ్లూ) వ్యాక్సిన్:** మహిళలందరూ దీన్ని తీసుకోవాలి, గర్భవతులు తప్పనిసరిగా తీసుకోవాలి. గర్భధారణ సమయంలో దీన్ని తీసుకోవడం వల్ల పిండంపై దుష్ప్రభావం పడుతుందా లేదా అనే దిశగా ఎటువంటి అధ్యయనాలు లేవు. అయితే గర్భం ధరించి ఉన్నప్పుడు తీసుకుంటే బిడ్డ పుట్టాక మొదటి ఆర్నెల్లపాటు చిన్నారికీ అది రక్షణ ఇస్తుంది. కాబట్టి నిర్భయంగా తీసుకోవచ్చు. ఫ్లూ వల్ల గర్భవతిలో చలి జ్వరం, కండరాల నొప్పులు, దగ్గు, గొంతు బొంగురు పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.



● **టెటనస్, డిఫ్తీరియా, పెర్టుసిస్ (డీపీటీ) వ్యాక్సిన్ :** బాధితుల్లో ఒకవేళ టెటనస్ వచ్చినట్లయితే కండరాలు బిగుసుకు పోయినట్లుగా అయ్యి, అసాధారణంగా ప్రవర్తిస్తాయి. డిఫ్తీరియా వస్తే గొంతు లోపల వెనక భాగంలో ఒక మందపాటి పొరగా ఏర్పడి, శ్వాస సమస్యలకు కారణమవుతుంది. ఆగకుండా వచ్చే ‘కోరింత దగ్గు’ (పెర్టుసిస్) మహిళల్ని ఎంతో బాధిస్తుంది. అందుకే ఈ మూడు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించుకోడానికి గర్భవతి విధిగా డీపీటీ వ్యాక్సిన్ తీసుకోవాలి.

టీ డాప్ అంటూ సంక్షిప్తంగా పిలిచే ఈ వ్యాక్సిన్‌ను గర్భం ధరించిన ప్రతిసారీ... గర్భధారణ తర్వాత 20 వారాలప్పుడు తీసుకోవాలి. కుదరని పక్షంలో 27వ వారం నుంచి 36వ వారం మధ్యలోనూ తీసుకోవచ్చు.

హెపటైటిస్ బి వ్యాక్సిన్ : కాలేయానికి ఇన్‌ఫ్లమేషన్ (వాపు, మంట) కలగజేసే హెపటైటిస్ బి వైరస్ చాలా తీవ్రమైనది. అందుకే హెపటైటిస్ బిని నివారించడానికి ఇప్పుడు బిడ్డ చిన్నవయసులో ఉండగానే మూడు మోతాదుల హెపటైటిస్ బి ఇవ్వడం మొదలైంది. ఈ వ్యాక్సిన్ తీసుకుంటే గర్భస్థ శిశువుకు హాని జరిగినట్టు ఎటువంటి అధ్యయనాలూ లేవు కాబట్టి నిర్భయంగా ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చు.


డా. కావ్యప్రియ వజ్రాల, కన్సల్టెంట్ ఆబ్‌స్టెట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్

కోవిడ్ వ్యాక్సిన్ : కోవిడ్ వ్యాక్సిన్ ఎప్పుడైనా తీసుకోవచ్చు. ప్రెగ్నెన్సీ టైమ్‌లో తీసుకున్నా ఇబ్బంది లేదు.

రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరల్ వ్యాక్సిన్: ఈ వ్యాక్సిన్‌ను కూడా 32 వారాల నుంచి 36 వారాల ప్రెగ్నెన్సీ సమయంలో తీసుకోవచ్చు.

కొందరికి మాత్రమే వాడాల్సిన వ్యాక్సిన్లు...

కొంతమంది గర్భవతులకు కొన్ని అంశాల్లో ముప్పును నివారించడానికి వారి పరిస్థితిని బట్టి వాళ్లు నిర్దిష్టంగా తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌లు ఇవి...

న్యూమోకాకస్ వ్యాక్సిన్: న్యూమోకాక్సీ అనేది ఒక రకం బ్యాక్టీరియా. దీనివల్ల నిమోనియాతో పాటు మరెన్నో ఇన్ఫెక్షన్లు రావచ్చు. ఉదాహరణకు చెవి ఇన్ఫెక్షన్స్, మెనింజైటిస్ వంటివి. కొందరు హై రిస్క్ మహిళలకు న్యూమోకాకల్ ఇన్ఫెక్షన్స్ సోకకుండా ఈ వ్యాక్సిన్ వాడాలి. వాస్తవానికి ఈ వ్యాక్సిన్‌ను గర్భధారణకు ముందే ఇవ్వడం మంచిది. అయితే... ఇది గర్భధారణ తర్వాత మొదటి మూడు త్రైమాసికాలలో ఎప్పుడైనా తీసుకోవచ్చు.

ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ : ఇది విదేశాలకు చెందిన దోమల ద్వారా వ్యాపించే ఒక రకం వైరల్ జ్వరం. దీని వల్ల కాలేయం, కిడ్నీలు దెబ్బతినడమే కాదు... ఒక్కోసారి తీవ్ర అంతర్గత రక్తస్రావంతో మరణం కూడా సంభవించవచ్చు. ఈ వ్యాధి మన దేశంలో లేదు గానీ... గర్భధారణ సమయంలో వృత్తిపరంగా కొన్ని ఆఫ్రికా దేశాలకు వెళ్లాల్సిన మహిళలు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలి. ఇందుకోసం సాంక్రమిక వ్యాధుల (ఇన్ఫెక్షియస్ డిసీజెస్)కు చికిత్స చేసే నిపుణుల ఆధ్వర్యంలో తీసుకోవడం మంచిది.

గర్భిణికి ఇవ్వకూడని వ్యాక్సిన్

జీవించి ఉండే వైరస్‌తో తయారు చేసే వ్యాక్సిన్ అయిన జోస్టర్ వ్యాక్సిన్‌ను గర్భవతికి ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు. మామూలుగా దీన్ని 50 ఏళ్లు, అంతకు పైబడిన లేదా గర్భధారణ వయసు మీరిన వారికే ఎక్కువగా సిఫార్సు చేస్తుంటారు.

ఇవిగాక మరికొన్ని... ఇవేకాకుండా గర్భవతులు అవసరాన్ని బట్టి మరికొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు కలరా, మెనింగోకోకస్, రేబీస్, జపనీస్ ఎన్‌కెఫలైటిస్, టైఫాయిడ్, హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా బీ వంటి వ్యాక్సిన్లను... ఆయా మహిళల వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని బట్టి... డాక్టర్ల సూచనలకు లోబడి తీసుకోవాల్సి ఉంటుంది.